

ఆకుల లావణ్య లక్ష్మి ఎందరికో స్ఫూర్తి, ఆదర్శం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వైకల్యం చదువుకు అడ్డంకి కాదని నిరూపిస్తూ ఆకుల లావణ్య లక్ష్మి ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులకు 345 సాధించడం ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. బుధవారం తన ఛాంబర్ నుంచి లావణ్య లక్ష్మితో కలెక్టర్ ఫోనులో మాట్లాడి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన 10వ తరగతి ఫలితాల్లో 87.99 శాతం, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 67.67 శాతం ఉత్తీర్ణత సాధించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించినట్టు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు నిరుత్సాహానికి గురి కావద్దని, రాష్ట్ర ప్రభుత్వం సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి, తగిన మార్గదర్శకం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

10 ఫలితాల్లో జిల్లా వెనకబాటు


- 15వ స్థానానికే పరిమితం
- 82.24 శాతం ఉత్తీర్ణత
- ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో కాకినాడ జిల్లా 82.24 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 15 స్థానం సాధించింది. ఈ సారి కూడా బలికలే పై చేయి సాధించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాగా వున్నప్పుడు మెరుగైన ఫలితాలు సాధించిన జిల్లా గత మూడేళ్ళుగా వెనుకబడి పోతుంది. ఈఏడాది జరిగిన పరీక్షల నేపథ్యంలో బుధవారం విడుదలైన ఫలితాల్లో మెరుగైన రిజల్ట్స్ సాధించామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు బాలురు 13 వేల 708, బాలికలు 13 వేల 660 మందితో మొత్తం 27 వేల 368 మంది హాజరయ్యారు. వారిలో బాలురు 10 వేల మంది 850 మంది, బాలికలు 11 వేల 658 మందితో మొత్తం 22 వేల 508 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 79.15 శాతం, బాలికల్లో 85.34 శాతంతో మొత్తం 82.24 శాతం ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా వున్నప్పుడు 2016-17లో 97.97 శాతం, 2017-18లో 97.61 శాతం, 2018-19 లో 98.19 శాతం, 2019-20లో నూరు శాతం, 2020-21 లో నూరు శాతం, 2021-22లో కేవలం 65.83 శాతం, జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లాలో 2022-23 లో 68.02 శాతం, 2023-24 లో 80.83 శాతం, ఇప్పుడు 2024-25లో 82.24 శాతం ఫలితాలు వచ్చాయి.



ఫలితాలపై సంతృప్తి

జిల్లాలో పదో తరగతి ఫలితాలు సంతృప్తినిచ్చాయని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాకినాడ జిల్లాకు 15వ స్థానం మాత్రమే దక్కడం కొంత బాధాకరమైన విషయం అన్నారు. ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు దిగులు పడవద్దని వారికి మరో అవకాశం ఉందన్నారు. అందువల్ల పట్టుదలతో చదవాలని డీఈవో సూచించారు.

మే 19 నుంచి సప్లిమెంటరీ

అడ్వాన్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుండి 28 తేదీ వరకు వుంటాయని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరు కావాలని అనుకునే అభ్యర్థులు రీకౌంటింగ్, రీ-వేరిఫికేషన్ ఫలితాల కోసం వేచిచూడకుండా ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1 లోపుగా ఆలస్య రుసుము లేకుండా, మే 1 నుంచి 18 వరకూ రూ.50 ఆలస్య రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. త్వరలోనే మార్కుల మెమోలు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. నిర్ణీత సమయానికి ఆయా పాఠశాలలకు మార్కుల సర్టిఫికెట్లు పంపిస్తామని తెలిపారు. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్ట్‌కూ రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్ట్‌కూ రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

భాష్యం విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్


యాళ్ల నేహాంజలి

కాకినాడ : కాకినాడ భాష్యం స్కూల్ పదో తరగతి విద్యార్థిని యాళ్ల నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించినట్టు భాష్యం కాకినాడ శాంతినగర్ శాఖ జోనల్ ప్రిన్సిపల్ వల్లూరి గోవిందరాజు తెలిపారు. తాను ఐఐటిలో చేరి ఐఎఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని నేహాంజని తెలిపింది. అనంతరం ఉత్తీర్ణత సాధించిన నేహాంజలిని పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఇంతటి ఉత్తీర్ణ సాధించిన పట్ల ఉపాధ్యాయులను, సిబ్బందిని గోవిందరాజు అభినందించారు.

జాబ్ కార్డు ఉన్న అందరికీ పని దినాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికీ పని దినాలు కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్ నుంచి డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావుతో కలిసి ఉపాధి హామీ పథకం అమలు తీరుపై, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్ రెడ్డితో కలిసి గృహ నిర్మాణ పనులపై మండల అభివృద్ధి అధికారులు, హౌసింగ్ అధికారులు, డ్వామా సహాయ ప్రాజెక్ట్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 16,8140 జాబ్ కార్డు దారులు నమోదు కాగా ఇప్పటి వరకు 1,22,931 మందికి పని దినాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో సీజనల్ పనుల వల్ల మిగిలిన కుటుంబాలకి రానున్న రోజుల్లో పని దినాలు కల్పించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటి నుంచి ఆయా ఎంపిడిఒల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు సూచనలు, స్థానిక ప్రాధాన్యతలు అనుసరించి ఉపాధి హామీ పని దినాలు కల్పిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి రోజూ 58 వేల పనిదినాలు కల్పించే విధానంలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు, అందులో భాగంగా 38,171 మేర లక్ష్యాలు సాధించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లాలో సగటున ప్రతి రోజూ సాధారణ పనిదినాలు 33,725, వ్యక్తిగత పనిదినాలు 2,068 , హౌసింగ్ పనిదినాలు 2,378 మేర ఉపాధి హామీ పనిదినాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఉపాధి హామీ కూలీలకు బీమా పథకం అమలు చేసి కుటుంబ భద్రత కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పిఎం జీవన్ జ్యోతి పథకం కింద రూ.436 వార్షిక ప్రీమియం చెల్లింపు ద్వారా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ఒక సంవత్సరం కాలపరిమితి గల, పునరుత్పాదక జీవిత బీమా పథకం, ఏ కారణం చేతనైనా మరణిస్తే రూ.2 లక్షల జీవిత బీమాను అందిస్తుందన్నారు. సేవింగ్స్ బ్యాంక్ ఖాతా ఉన్న 18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వ్యక్తులకు అందుబాటులో ఉందన్నారు. పిఎం సురక్ష బీమా యోజన కింద వార్షిక చందా రూ.20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు మేర బీమా చెల్లిస్తారని తెలిపారు. ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలీకి బీమా పథకం అమలు చేయాలని స్పష్టం చేశారు.

గృహ నిర్మాణ పనుల కోసం 27,483 కుటుంబాలకు 22.38 లక్షల మేర పనిదినాలు కల్పించి, రూ.59 కోట్ల 73 మేర ఆర్థిక అంచనాలు వేశామన్నారు. వాటిలో 20.33 లక్షల పని దినాలు, రూ.55 కోట్ల 21 లక్షల మేర పనులకు సంబంధించి ఉపాధి హామీ పని దినాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. మిగిలిన వాటికిపై రబీ సీజన్ అనంతర దృష్టి పెడతామని తెలిపారు.

ఉగ్రవాదులకు వ్యతిరేకంగా క్యాండిల్ ర్యాలీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు



నిడదవోలులో క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ధవళేశ్వరంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం సిఐ టి.గణేష్, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు. మృతులకు సంతాపం తెలిపారు.

నిడదవోలు పట్టణంలోని గణేష్ చౌక్ నుండి గణపతి సెంటర్ వరకూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి అమానవీయమని, ఎంత మాత్రం సహించరాదని అన్నారు. పర్యాటకులపై టెర్రరిస్టులు క్రూరమైన దాడికి పాల్పడడం కలచివేసిందన్నారు.

25న ఆర్ట్స్ కాలేజిలో జాబ్ మేళా

ప్రజాశక్తి -రాజమహేంద్ర వరం రూరల్

ఈ నెల 25న నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విడిజి మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 30కు పైగా పేరొందిన ప్రైవేట్ కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఎంబిఎ మరియు ఇతర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. మరిన్ని వివరాల కోసం 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఇంగ్లీష్ భాషా దినోత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ ప్రభుత్వ కళాశాల ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో ప్రసిద్ధ ఆంగ్ల నాటకకర్త విలియమ్ షేక్స్పియర్ జనన, మరణ దినాన్ని పురస్కరించుకొని బుధవారం ఇంగ్లీష్ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం.శ్రీలక్ష్మి, ఇంగ్లీష్ విభాగం ఇన్‌ఛార్జి అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా డాక్టర్ ఎస్‌జె.ఎర్నెస్ట్, ప్రిన్సిపల్, నోబుల్ కాలేజ్, మచిలీపట్నం ముఖ్య ఉపన్యాసం అందించారు. శ్రీలక్ష్మి ఇంగ్లీష్ భాషా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. 'బార్డ్ ఆఫ్ అవాన్'గా ఖ్యాతి గాంచిన విలియమ్ షేక్స్పియర్ సాహిత్య సేవలు ప్రపంచ సాహిత్యాన్ని, సంభాషణా నైపుణ్యాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో వివరించారు. డాక్టర్ ఎర్నెస్ట్ షేక్స్పియర్ రచించిన శోకాంతక నాటకాలు (ట్రాజెడీల) గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. ప్లాటో మరియు అరిస్టాటిల్ శోకాంతక నాటకాలపై వ్యక్తీకరించిన భిన్నమైన అభిప్రాయాలను వివరించారు. షేక్స్పియర్ రచించిన నాలుగు గొప్ప నాటకాలు హామ్‌లెట్, ఒథెల్లో, కింగ్‌లియర్, మెక్‌బెత్ పాత్రలను ఆయన విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పశువుల తాగునీటి తొట్టెలను పరిశీలిస్తున్న పీడీ

పశువుల తాగునీటి తొట్టెలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గోపాలపురం

పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.నాగమహేశ్వరరావు ఆదేశించారు. బుధవారం మండలంలోని ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. గోపాలపురంలో ఫారం పాండ్, నర్సరీ పనులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ సమావేశపు ఆవరణలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ మహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలని సూచించారు. ఉపాధి వేతనదారులు అందరితో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకానికి, ప్రధానమంత్రి జ్యోతి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష పథకానికి 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల లోపు రూ.20 చెల్లించి ప్రమాద బీమా రెండు లక్షలు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకానికి 18-50 వయసు కలిగిన వారు రూ.436 చెల్లించి, ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు ఘన సన్మానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరంలోని స్థానిక గూడ్స్ గేట్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం షైనింగ్ స్టార్స్-2025 ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో రాష్ట్ర/ జిల్లా /కళాశాల స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అభినందిస్తూ విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎస్‌విఎల్. నరసింహం మాట్లాడుతూ కళాశాలలో హోటల్ ఆపరేషన్ గ్రూప్ చదివిన ఎన్.శ్రావణి సత్య రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచి విద్య ఐటి శాఖ మంత్రి నారా. లోకేష్ ద్వారా అవార్డు తీసుకుందని, కళాశాల స్థాయిలో 982 మార్కులతో జె.సౌమ్య శాలిని టాపర్‌గా నిలిచిందని తెలిపారు. ఈ అవార్డులు పొందిన వారిలో 90 శాతం దినసరి కూలీలు, ఆటో రిక్షాల నడిపేవారు, పేద బలహీన వర్గాలు చెందినవారి పిల్లలు ఉండడం విశేషమని తెలిపారు. షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన 13 మంది విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపకులను, సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.విజయశ్రీ, ధవళేశ్వరం కళాశాల ప్రిన్సిపల్ జెవిఎస్ఎస్.సుబ్రహ్మణ్యం కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.త్రినాథరాజా, ఎజిఎంసి బి.రామకృష్ణ, అధ్యాపకులు బివైఎస్‌వి.ప్రసాద్, ఎ.కళ్యాణ్ కుమార్, కె.మౌనిక పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో తిరుమలరావు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో తిరుమలరావు

10వ తరగతి ఫలితాల్లో 'తిరుమల' విజయభేరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎపి ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు.ఉప్పాల జశ్వంత్ పవన్, సిహెచ్, సుప్రుత భరద్వాజ్ 596 మార్కులు, దేవిరెడ్డి చైతన్య సహస్ర, చాగంటి బాశ్య హర్షిత, సారిక సందిన 595 మార్కులు సాధించారని, మేకా పంక్త, ఈడుపుగంటి దివ్యశ్రీ, బార సాత్విక, కూర్మాల తారక సాయి సూర్య ఫణి శ్రీ వసంత్, లోట్ల హస్నుజ 594 మార్కులు సాధించారని, 590పైన 41 మంది విద్యార్థులు, 580 పైన 326 మంది విద్యార్థులు, 570 పైన 652 మంది విద్యార్థులు, 560పైన 900 మంది విద్యార్థులు, 550 పైన 1078 మంది విద్యార్థులు, 500పైన 1458 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరితో కలిసి ఆయన అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వెయ్యాలి

ప్రజాశక్తి-కడియం

భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యం కోసం ప్రతి రైతు తప్పనిసరిగా వారు సాగు విస్తీర్ణంలో దశల వారీగా ప్రకతి వ్యవసాయ దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం కడియం మండలం మాధవరాయుడుపాలెంలో గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ లాభసాటిగా ఉండేలా తగిన సూచనలు సలహాలు ఇస్తున్నట్టు తెలిపారు. చంటి లాంటి ఆదర్శ రైతులతో ప్రకృతి వ్యవసాయ సాగు పెంచడంపై అవగాహన కల్పిస్తామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, సర్పంచ్ చంటి తదితరులు ఉన్నారు.


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ఫలితాల్లో భాష్యం విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

10వ తరగతి ఫలితాలలో భాష్యం ఈస్ట్-2 జోన్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. 600 మార్కులకు గాను 599 మార్కులతో బొమ్మూరు విద్యార్థి కె.హర్షిత్ రాష్ట్ర స్థాయి రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. 593, 592, 591, 591, 590 వంటి మరెన్నో ఉత్తమ మార్కులు భాష్యం విద్యార్థులు సాధించారు. జోనల్ ఇన్‌చార్జి ఆంజనేయులు విద్యార్థులను అభినందించారు.

ఆర్‌జెడికి కాంట్రాక్టు లెక్చరర్ల అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ జోన్ 1, 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మజ్జి ఆదినారాయణను ఎపి కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ రౌతు గోపి, జోనల్ కన్వీనర్ డాక్టర్ వౌలుపు కనకరాజు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేస్తూ అత్యధిక పాస్ పర్సంటేజ్ తీసుకురావడంలో కీలక పాత్ర వహించిన కాంట్రాక్టు లెక్చరర్లకు న్యాయం చేయాలని, రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సహకారం అందించాలని కోరారు. దీనిపై దీనిపై ఆర్‌జెడి ఆదినారాయణగా మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మరింత అభివృద్ధి చేయడానికి కాంట్రాక్టు లెక్చరర్లు మరింత కృషి చేయాలని వారు కోరారు.


కమిషనర్‌కు ప్రతిపాదన పత్రాలు అందిస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రతిపాదనలు


ప్రజాశక్తి - సీతానగరం, కోరుకొండ

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు రాజానగరం నియోజకవర్గంలో నీటి సరఫరాను మెరుగు పరచడానికి అమరావతిలో పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి తక్షణ చర్యలు చేపట్టాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ కోరారు. ఈ మేరకు రూ.416.98 కోట్ల అంచనా వ్యయంతో 138 పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను బుధవారం అందజేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 413.74 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు, 89 ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, గ్రౌండ్ సర్వీస్ లెవెల్ రిజర్వాయర్లు, 84 బోర్ వెల్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంఎల్ఎ వివరించారు. నియోజకవర్గంలో తక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రాధాన్యతల క్రమంలో ఈ పనులను చేపట్టాలని బలరామకృష్ణ పంచాయతీ రాజ్ కమిషనర్‌ను కోరారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చాగల్లు మండలంలో 69 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలంలో ప్రభుత్వ పాఠశాలనుండి పదో తరగతి విద్యార్థులు 440 మంది హాజరై 303 మంది ఉత్తీర్ణులై 69 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఇఒ గురుప్రసాద్ తెలిపారు. ఎస్‌వి ఆర్కే ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 42 మంది పరీక్షకు హాజరుకాగా 42 మంది ఉత్తీర్ణులై నూరు శాతం సాధించారని, చాగల్లు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు 153 మంది హాజరై 93 మంది ఉత్తీర్ణులై 60 శాతం సాధించినట్లు హెచ్ఎం కృష్ణమోహన్ తెలిపారు. రాజరాజేశ్వరి విద్యార్థులు 9 మంది హాజరై 9 మంది ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాలు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ వల్లిపల్లి వెంకట రామారావు తెలిపారు.



విచ్చలవిడిగా ఫార్మసీలు

- అర్హత లేని సిబ్బందితో నిర్వహణ
- డాక్టర్ల చీటీ లేకున్నా మందుల విక్రయం

జుహితకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక లాలాచెరువు నగరపాల సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థిని జుహిత గుణ జాతీయస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన సంగతి విదితమే. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి బాలేష్ గుప్తా తమ ట్రస్ట్ తరపున రూ.20 వేల చెక్కును హెచ్ఎం ఎ.మల్లేశ్వర రావు ద్వారా అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి నగరానికే కాక రాష్ట్రానికి మంచి పేరు తేవాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు కలిసి మరో రూ.5 వేలు జుహితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కందికొండ రమేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర రావు, పివి.రమణ, సరితరంజ పాల్గొన్నారు.


జుహితకు నగదు సాయం అందిస్తున్న ఛాంబర్ సభ్యులు

దిండి దిపిక మండలం ఫస్ట్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని జెడ్‌పి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని దిండి దీపిక మండలంలో ఫస్ట్ సాధించింది. పదో తరగతి పాఠశాల విద్యార్థినిలు మొత్తం 207 మందికి గాను 180 మంది ప్రథమశ్రేణి సాధించారు. 54 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. 585 మార్కులతో దీపిక జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల నుండి అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో575 కె. షారోన్ గ్రేసి, తతీయ స్థానంలో ఇ.హేమ 566 మార్కులు సాధించారు. హెచ్ఎం ఐడికెవి.ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎపిఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోకవరం

భూపతిపాలెం ఎపిఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 83 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయగా 83 మంది విద్యార్థులు పాసయ్యి నూటికి నూరు శాతం సాధించారు. పి.తేజశ్రీనాగు 573 మార్కులు, పి మనోహర్ 573, ఎం.బాల రాజేష్ 571, జి.హర్షిత్ 571 అత్యధిక మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ బి.రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వరస దొంగతనాల కేసులలోని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన కెమెరాలు, ల్యాప్‌టాప్, హార్డ్ డిస్కులు, ప్రింటర్లు, మానిటర్‌లతోపాటు ఒక కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నాయక్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున దేవరపల్లి మెయిన్ రోడ్డులోని ఆర్‌కె ఫోటో స్టూడియో, నిడదవోలులోని మరో రెండు ఫోటో స్టూడియోలలో షట్టర్ తాళాలు పగలగొట్టి లోపల గల విలువైన సామాగ్రిని నిందితులు చోరీ చేసినట్లుగా గుర్తించారు. ఈ మేరకు నమోదైన కేసులను చేధించేందుకు పోలీసుల బృందాలు గుంటూరు, విజయవాడ, కోదాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన షేక్ సమీర్ ఫైజల్(21), అల్లాడి నాగమణికంఠ ఈశ్వరమణి(24), నాగదాసరి మెసిమన్ అనే సిమ్(25), రామిశెట్టి దేవీప్రసాద్(21), మనగంటి గోపి(25), జెల్లి వెంకట సూర్య సత్య మణి సాయి కీర్తన (24)లను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందుతులు ముందస్తుగా దొంగతనం చేయబోయే ప్రదేశంలో రెక్కీ నిర్వహించిన అనంతరం రాత్రివేళ జన సంచారం లేని సమయాలలో దొంగతనాలు చేసేవారని అన్నారు. స్వల్పకాలంలో ఈ కేసులను చేధించి దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, సతీష్‌కుమార్‌లతోపాటు, సిబ్బందిని ఆయన అభినందించారు.

బెల్టు షాపుపై దాడి- ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - కాత్రేనికోన

కాత్రేనికోన గ్రామ శివారు వేట్లపాలెంలో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై కాత్రేనికోన పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో కొప్పడి సత్యనారాయణ, కొప్పాడి నాగబాబులను అరెస్టు చేశారు. . ఈ దాడిలో 180 ఎంఎల్ మద్యం సీసాలు 464, బీరు సీసాలు 108 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రమాదవశాత్తు ఏలేరు ఎడమ కాలువలో మంగళవారం గల్లంతయిన గుమ్మరేగుల గ్రామానికి చెందిన వెంటూరి జయాబాబు(29) మృతదేహం బుధవారం లభించింది. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడి జాతీయ రహదారిలోని డివైడర్‌లో మొక్కలకు నీళ్ల పోస్తున్న ట్యాంకర్‌ను చెన్నైకి వెళ్తున్న వ్యాన్ వేగంగా బుధవారం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అమరాసన్‌కు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతిని ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విశాఖలో యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సామర్లకోట భాస్కర్ కాలనీకి చెందిన యువకుడు షేక్ కాజా మొహిద్దీన్ (24) దుర్మరణం చెందాడు. మృతిని కుటుంబీకులు అందించిన వివరాలు ప్రకారం.. విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తుండగా అతనిని చూసేందుకు సామర్ల కోట నుంచి తల్లిదండ్రులు మంగళవారం విశాఖపట్నం వెళ్లారు. ఈ సందర్భంగా యువకుడు మొహిద్దీన్ తల్లిదండ్రులతో కలిసి విశాఖపట్నం బీచ్‌కి వెళ్తుండగా స్కూటీపై వెళుతున్న యువకుని కాన్వెంట్ సెంటర్లో లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై విశాఖపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఆగివున్న లారీని కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా సింహాచలం ఎస్ఆర్.పురం చెందిన గుంపిన కళ్యాణచక్రవర్తి, గుంపిన రవితేజ అనకాపల్లిలో స్నేహితుని నుంచి కారు తీసుకుని కాకినాడలో ఉన్న వేరే స్నేహితుడికి కారు అద్దెకి ఇవ్వడానికి వెళుతుండగా గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద అర్ధరాత్రి రెండు గంటల సమయంలో రోడ్డుపక్క మార్జిన్ దిగి మట్టిరోడ్లో పార్కింగ్ చేసిన లారీని ఢీకొ ట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రవితేజ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అతని పక్కన కూర్చున కల్యాణ్‌చక్రవర్తి తలకు బలమైన గాయం అయింది. దీంతో అతనిని పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మార్చురీ ఫ్రీజర్ బాక్స్ అందజేత

ప్రజాశక్తి-కడియం

అత్యవసర పరిస్థితులలో మృతదేహాలను ఉంచేందుకు అవసరమైన మార్చురీ ఫ్రీజర్ బాక్స్‌ను మండలంలోని బుర్రిలంకకు చెందిన పాఠంశెట్టి శ్రీనివాస చక్రవర్తి అందజేశారు. ఈ ఫ్రీజర్ బాక్స్ కొంతకాలంగా పాడై మూలన పడింది. ఇది తెలుసుకున్న శ్రీనివాస్ చక్రవర్తి మళ్ళీ సుమారు రూ.30 వేలతో మరమ్మత్తులు చేయించి బుధవారం కడియపులంక గ్రామ పంచాయతీ కార్యదర్శి సుస్మిత జోన్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటంశెట్టి రామ్‌జీ, మల్లు ధనుంజయ కుమార్, సుంకర రాజబాబు, పాఠంశెట్టి మైత్రేయ, గట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-చాగల్లు

ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్, కొత్త లైన్ వేయడం కోసం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మార్కొండపాడు గ్రామానికి గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామనిమండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. మార్కుండపాడు గ్రామానికి 3 పేస్ సరఫరా ఉదయం 4 గంటల నుండి 7 గంటల వరకు ఉంటుదని తెలిపారు. వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.

యానాం వార్తలు

సీచేమ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

మెట్టకూరులోని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం సీచేమ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అయింది. పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ సహకారంతో యానాం క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.రమేష్, సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీలు చిట్టి, కె.ప్రసాద్, పి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటును ఆర్ఎఒ మునిస్వామి, సిఐ అడలరసన్, ఎస్ఐ పుణీత్‌రాజ్, నవోదయ ప్రిన్సిపల్ కీర్తి, మెట్టకూరు హైస్కూల్ హెచ్ఎం పి.రాజారామ్ మోహన్‌రావు పాల్గొని ప్రారంభించారు. మొత్తం 10 జట్ల మధ్య 30 ఓవర్ల మ్యాచ్‌ను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. మే 15వ తేదీ వరకు లీగ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఇటీలు పాలికి స్వామి, శేరు విష్ణు, చింతా వెంకన్న, జల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కామిశెట్టి సావిత్రికి నివాళి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు, మాజీ ఎంఎల్ఎ కామిశెట్టి సావిత్రి జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజ్ తదితరులు పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కుటుంబ సభ్యులు పైడికొండల రాజబాబు, చెక్కల అరుణ్‌కుమార్, శ్రీమంతుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రీజెన్సీ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - యానాం

10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రీజన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పరీక్షలకు 75 మంది హాజరుకాగా వీరిలో 46 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. 73 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పాఠశాల హెచ్ఎం.టివిఎస్ఎస్‌వి.ప్రసాద్‌రావు తెలిపారు. కోడూరి నారాయణ మౌనికకు 589, పి.శ్రీరామ్ 588, సిహెచ్.నిశాంత్ శ్రీవర్ధన్ 584, ఎన్.తనుజా దేవి నాగమల్లిక 583, జి.మేఘన ప్రభమహేశ్వరి 581, ఎం.శశి పార్థు 580 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రీజెన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జివిఎన్.నాయుడు, రీజెన్సీ సెరామిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యాంతప్రసాద్, హెచ్ఎం ప్రసాదరావు అభినందించారు. అలాగే యానాం రీజియన్లో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారదా ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్లో 53 మంది పరీక్షకు హాజరుకాగా 49 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీజియన్ ప్రథమస్థానాన్ని తలాటం సహస్రా 594 మార్కులు, ఎస్‌జె.దుర్గాసాయిలక్ష్మి 590 మార్కులతో ద్వితీయస్థానాన్ని, కోడూరి నారాయణ మౌనిక 589 మార్కులతో తృతీయస్థానాన్ని సాధించారన్నారు.

దేవరపల్లిలో 86 శాతం మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండల ప్రభుత్వ పాఠశాలలలో 604 మంది విద్యార్థులు హాజరై 511 మంది విద్యార్థులు 86 ఉత్తీర్ణత సాధించారు. పభుత్వ పాఠశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్నగూడెం పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.తనూశ్రీ 582 మార్కులతో ప్రథమ స్థానం పొందింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నాయగూడెం, దేవరపల్లి పాఠశాలల నుండి 580 మార్కులతో కాపా హడాసా, ఎస్‌కె.కమర్తాజ్ ద్వితీయ స్థానం సాధించారు.

సర్కారు బడులు - చదువుల తల్లులు

ప్రజాశక్తి-కడియం

మండలంలో ప్రైవేట్ స్కూల్స్‌తో పోటీ పడుతూ ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. మురమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పోలోతు భవ్య శ్రీదేవి 591 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధిండంతో పాటుగా పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత పొందారు. మాధవరాయుడుపాలెం ఉన్నత పాఠశాల నుంచి పమ్మి లీలా మేఘన 582 మార్కులతో ద్వితీయ స్థానం, కడియపులంక ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.భాగ్యలక్ష్మి 576 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఎంఇఒలు మణికుమార్, నాగేశ్వరరావు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

మూడు స్థానాలు శ్రీ ఆదిత్యకే

ప్రైవేటు పాఠశాలల విభాగంలో మండల కేంద్రమైన కడియం శ్రీ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండల స్థాయిలో మూడు స్థానాలు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ బైరశెట్టి రామకృష్ణ తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీమతి యాజమాన్యం

ఫలితాలలో శ్రీమహతి ప్రభంజనం

ప్రజాశక్తి - సీతానగరం

శ్రీ మహతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో ఘన విజయం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. గంటా లక్ష్మీప్రసన్న, మద్దిపాటి దుర్గాగణేష్ కవల వంశీలు అత్యధికంగా 590 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు మండలంలోనే కాక నియోజకవర్గంలో కూడా ప్రథమ స్థానంలో నిలిచారు.

సత్యమాంబ బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - సీతానగరం

పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు సత్తా చాటారు. మొత్తం 35 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు, బాలికల ఉత్తీర్ణత శాతం 88.5 శాతం నమోదైంది. 40 మంది బాలురకు గాను 34 మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులందరికీ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

మోడల్ ఇంపి సెట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్ మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని విద్యారంగ ప్రము ఖులు పిలుపునిచ్చారు. బుధవారం ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్య క్రమంలో కళాశాల డైరెక్టర్ జివి.కృష్ణమరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీకాంత్, ఎఒ జివికె.వర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్తలు మాజీ ఎంఎల్‌సిలు చుక్కా రామయ్య, కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈ పరీక్షను గత 24 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నా రు. 5 రోజులపాటు ఐడియల్ కళాశాలలో నిర్వహించే ఈ పరీక్షలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి గంగా సూరిబాబు కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాంకేతిక విద్య నాణ్యత కొరవడిందని, తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు ఉండడం లేదని అన్నారు. ఎఐసిటి ఈ నిబంధనలను అన్ని కళాశాలలో పాటించాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్‌కుమార్, రఘువరన్, పాల్గొన్నారు.

పలువురికి తోట నరసింహం పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో సతీ వియోగంతో బాధ పడుతున్న గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొరను బుధవారం మాజీ మంత్రి తోట నరసింహం, ఆయన తనయుడు రామ్‌జీ పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి సిహెచ్.చిన్న కుమార్ రెడ్డి, వారి భార్య రమణ కుమారిని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట వైసిపి నాయకులు దాసరి చినబాబు, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, వైఎస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, కర్రి సూరారెడ్డి, సమ్మిట మోహన్, సరకణం మురళీకృష్ణ, బొర్రా శేఖర్, బడితబోయిన చిన్న, నండూరి బుజ్జి, బదిరెడ్డి అప్పన్నదొర, బదిరెడ్డి రాంబాబు, బ్యాల అబ్బులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 94 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒలు టి.కుశలవదొర, సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 2024,2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాసిన 1160 మంది విద్యార్థులకు గాను 1087 విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. శ్రీరంగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పెంటకోటి శ్రీ విజయ, గాదరాడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన గొడ్డు రమ్యశ్రీ 578 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించగా, గుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన బి.గౌతమి 577 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. వారిని పలువురు అభినందించారు.

పది ఫలితాల్లో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కరెళ్ళ నవ్యశ్రీ పద్మ 571 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఇఒ సిహెచ్.సక్సేనా రాజు తెలిపారు. మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 66.95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. 560 మార్కులతో కె.కుసుమ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

విద్యార్థుల తరలింపు ఆపాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మోడల్ స్కూల్స్ పేరుతో ఎలిమెంటరీ పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను తరలించి ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయటం అన్యాయమని సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ అన్నారు. బుధవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ 117ను అమలు చేయబోమని, ఆ జీవో రద్దు చేస్తామని కూటమి పార్టీల నేతలు ప్రకటించారన్నారు. కానీ చాప కింద నీరులా కొన్ని మార్పులతో నూతన విద్యా విధానం జిఒను అమలు ప్రారంభించిందన్నారు. మోడల్ స్కూల్స్ పేరుతో తరగతులను విలీనం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులను ఉంచి 3,4,5 తరగతులను మరో చోటుకు మార్పు చేసి వాటినే మోడల్ స్కూల్స్ అని చెబుతున్నారన్నారు. 14 పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మారుస్తూ నివేదికలు పంపించారన్నారు. పట్టణంలో 3 ఉన్నత పాఠశాలలు 4 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉంటే వాటిలో మూడు అప్పర్ ప్రైమరీ పాఠశాలలను ఎలిమెంటరీ మోడల్ స్కూల్స్‌గా మార్చారన్నారు. ఎక్కడైనా పాఠశాలలను అభివృద్ధి చేస్తూ తరగతి గదులను పెంచుతూ వాటిని హైస్కూల్స్‌గా మార్చాలని, కానీ అందుకు విరుద్ధంగా తరగతులను విలీనం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేదారి నాగు, సిరపరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధిక శాతం తేమ ఉన్నా కొనుగోలు

ప్రజాశక్తి - పిఠాపురం

రైతులు పండించిన ధాన్యంలో 22 శాతం వరకు తేమ ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్ఆర్‌హెచ్ఆర్ పాఠశాలలో వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నిబంధనల ప్రకారం రైతులు వద్ద నుంచి కొనుగోలు చేసే ధాన్యంలో17 శాతం తేమ ఉండాల్సినప్పటికి 22 శాతం వరకు తేమ ఉన్న రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అందుకు సరిపడా అదనంగా ఒక శాతానికి ఒక కేజీ చొప్పున ధాన్యం తూకం వేయాలన్నారు. 22 శాతం కంటే తేమ ఎక్కువగా ఉన్నట్లయితే రైతు విధిగా ధాన్యాన్ని ఎండబెట్టిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. దళారుల బారినబడి పడి రైతులు మోసపోకుండా మద్దత్తు ధరకు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిఎం ఎం.దేవులా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్. సత్యనారాయణరాజు, వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పలువురికి టీకాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపత్తి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు భాష, రజిమ్ బీమ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విశాఖపట్నం రఘు కళాశాలలో ఉపాధ్యాయురాలిపై విద్యార్థిని చెప్పుతో దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఎస్ఎస్ఎస్ పాఠశాల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పైల రాణాప్రతాప్ మాట్లాడారు. ఉపాధ్యాయులు కోన రాజారావు, మీసాల తమ్మారావు, తేలు నవీన్, వెన్న ఉమామహేశ్వరి, ఇంటూరి మహాలక్ష్మి, జొన్నాడ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. పెద్దనాపల్లి నుంచి చిన్ని పేరు జాతీయ రహదారి వరకు రూ.1.35 కోట్లతో బీటీ రోడ్, రూ.63 లక్షలతో సిసి రోడ్లు, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు రూ.10 లక్షలు కేటాయించామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోపాలపురం

పది పరీక్ష ఫలితాలలో ప్రైవేటు పాఠశాలలతో పాటు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్త మార్కులు సాధించి సత్తా చాటారు. సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి చెందిన కె.జోత్స్నశ్రీ 585 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం సాధించింది. అదే పాఠశాలకు చెందిన గండ్రోపు జాహ్నవి దేవి 581 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలచింది. ఆ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సి, ప్రిన్సిపల్ సిస్టర్ సిల్బీ ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. రాజంపాలెం హైస్కూల్‌కు చెందిన తూరపాటి ఫ్రాన్సిస్ 580 మార్కులు సాధించాడు. గోపాలపురం విద్యార్థి ఎం.గీత సౌమ్య 579 మార్కుల సాధించింది. మొత్తం 79.46 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు ఎంఇఒలు జి.శ్రీనివాస్, ఎ.మహేశ్వరరావు తెలిపారు.

ఫలితాల్లో మాంటిస్సోరి హవా..

ప్రజాశక్తి-తాళ్లపూడి



సుమాంజలి

మండలంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ పాఠశాల హవా కొనసాగింది. మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఈ సంవత్సరం కూడా తన హవాను కొనసాగించింది. మండల స్థాయిలో మొదటి ఆరు ర్యాంకులను ఈ పాఠశాల సొంతం చేసుకుంది. 600 మార్కులకు గాను 590 మార్కుల తో మండల ప్రథమ స్థానం సాధించడంతోపాటు 584 మార్కుల వరకు ఆరు ర్యాంకులను స్వాధీనం చేసుకుంది. శిరిగినీడి సత్యదేవ్ 590 మార్కులు, చెరుకు సుమాంజలి 588 మార్కులు, బండారు మేఘన 585 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వ్యవస్థాపక కరస్పాండెంట్ అనీష్ దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో తీన్మార్ డప్పులు బాణాసంచాతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - నిడదవోలు

ఈ నెల 14న కొవ్వూరు సీతంపేటలో గోదావరి పాయలో ప్రమాదవశాత్తు మునిగి చనిపోయిన చర్చ్ పేటకు చెందిన విద్యార్థులు మత్తి ప్రకాష్, గంధం హర్షల కుటుంబాలను ఆదుకోవాలని కెవిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీరిద్దరివీ దళిత సామాజిక తరగతికి చెందిన నిరుపేదకుటుంబాలని, ఒక్కో కుటుంబానికీ రూ.10 లక్షల నష్ట పరిహారం ప్రకటించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మంత్రి కందుల దుర్గేష్ ఈ కుటుంబాలను ఆదుకునేలా చొరవ తీసుకోవాలని కోరారు.



సిసి కెమెరాలను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

సిసి కెమెరాల పనితీరుపై సిఐ ఆరా

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సిసి కెమెరాల పనితీరును సిఐ నాయక్ గోపాలపురం ఎస్ఐ సతీష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సిఐ నాయక్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో, శాంతిభద్రతల పరిరక్షణలో ఈ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లలో, రద్దీగా ఉండే ప్రదేశాల్లోను, నేరాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లోను ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇవి అత్యధిక రిజల్యూషన్ కలిగి ఉండటం వల్ల, చిన్నపాటి వివరాలను కూడా స్పష్టంగా చూడవచ్చని తెలిపారు.